Name of the Newspaper : SAKSHI
Edition : DISTRICT EDITION (VISAKHAPATNAM)
Date : 31-07-2019
Page No. : 3



# దేశ ఆర్థిక వ్యవస్థలో మత్స్య పరిశ్రమ కీలకం

- ప్రపంచ ఆక్వాసాగులో భారత్‌ది రెండో స్థానం
- సముద్ర ఉత్పత్తుల్లో మూడో స్థానం
- ఐసీఏఆర్ మెరైన్ ఫిషరీస్ ఏడీజీ డాక్టర్ ప్రవీణ్‌పుత్ర



సమావేశంలో సాంకేతిక సావనీర్‌ను విడుదల చేస్తున్న ఐసీఏఆర్ ప్రతినిధులు

పాతపోస్టాఫీసు(విశాఖ దక్షిణ): దేశ ఆర్థిక వ్యవస్థలో మత్స్యపరిశ్రమ కీలకంగా మారిందని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (ఐసీఏఆర్–సీఐఎఫ్‌టీ) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (మెరైన్ ఫిషరీస్) న్యూఢిల్లీ, డాక్టర్ ప్రవీణ్‌పుత్ర అన్నారు. విశాఖపట్నం ఐసీఏఆర్, సీఐఎఫ్‌టీ ఆధ్వర్యంలో ఐసీఏఆర్ సమావేశ మందిరంలో భారతదేశ మత్స్యపరిశ్రమ, ఆక్వాసాగులో ఎదుర్కొంటున్న సవాళ్లు, అవకాశాలు అనే అంశాన్ని చర్చించేందుకు 'హరిత మత్స్యకీ–2019' పేరిట సోమవారం హిందీ భాషలో జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ప్రవీణ్‌పుత్ర మాట్లాడుతూ మత్స్య, పాడి పరిశ్రమలు అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మత్స్య, పశుసంవర్థక, పాడిపరిశ్రమ పేరిట మంత్రిత్వశాఖను ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రపంచంలో భారతదేశం ఆక్వాసాగులో రెండో స్థానం, మత్స్య ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉందన్నారు. దేశవ్యాప్తంగా మాట్లాడుతున్న హిందీ భాష జాతీయతను పెంచుతుందన్నారు. ఒకే జాతి ఒకే భాష అనే నినాదంతో అందరూ ఏకీభవించాలని కోరారు. శాస్త్రీయ సాధనా ఫలాల వివరాలను స్థానిక భాషలో స్థానిక వ్యాపారులకు, రైతులకు అందించడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చున్నారు.

సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వి.పద్మనాభం మాట్లాడుతూ మత్స్యపరిశ్రమలో సవాళ్లు అధికంగా ఉన్నాయని తెలిపారు. వీటిని అధిగమించేందుకు ఎప్పటికప్పుడు మత్స్యపరిశ్రమ శాస్త్రవేత్తలు, వ్యాపారులు (స్టేక్‌హోల్డర్స్) తమ ఆలోచనలను, అనుభవాలను పంచుకోవాలని సూచించారు. ఐసీఏఆర్ (కొచ్చి) డైరెక్టర్ డాక్టర్ సి.ఎన్.రవిశంకర్ మాట్లాడుతూ ఆక్వాకల్చర్, మత్స్యపరిశ్రమలపై సదస్సులు నిర్వహించేందుకు ఏపీ అనుకూలంగా ఉంటుందని అన్నారు. మత్స్యపరిశ్రమ అభివృద్ధి చెందేందుకు ఐసీఏఆర్–సీఐఎఫ్‌టీ కృషి చేస్తుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై హిందీలో అవగాహన పెంచుకునేందుకు ఇటువంటి సదస్సులు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కొచ్చి, కేరళ, ముంబయి, మహారాష్ట్ర, గుజరాత్‌లలో హరిత మత్స్యకీ పేరిట హిందీలో సదస్సులు నిర్వహించామని తెలిపారు.

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అతిథులు సదస్సులో వివిధ అంశాలకు సంబంధించిన 44 ప్రదర్శనలు ఇచ్చారు. వీటిలో 21 మౌఖిక, 23 పోస్టర్‌లు ఉన్నాయి. సదస్సులో భాగంగా ఐసీఏఆర్ ప్రాంతీయ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ సుభదీప్ ఘోష్, అధికారి భాష సంచాలకులు డాక్టర్ జె.రేణుకలను సత్కరించారు. కార్యక్రమంలో ప్రాంతీయశాఖ శాస్త్రవేత్త డాక్టర్ రఘుప్రకాష్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ యు.శ్రీధర్ పాల్గొన్నారు.